క్లుప్తంగా

'ఏక్ దిన్ మే కరోడ్ అకౌంట్స్'

హసన్‌పర్తి: భారత తపాలాశాఖ ఏక్ దిన్ మే కరోడ్ అకౌంట్స్ (ఒకరోజులోనే కోటి ఖాతాలు) కార్యక్రమాన్ని చేపట్టినట్లు హసన్‌పర్తి పోస్ట్‌మాస్టర్ బంగారు నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈనెల 28నుంచి 30వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

డివిజన్ అభివృద్ధే ధ్యేయం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజిత

హసన్‌పర్తి: అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. 55వ డివిజన్ బ్యాంక్‌కాలనీ -11లో సుమారు రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించనున్నట్లు వివరించారు. సమస్యలను కాలనీవాసులు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, కార్యదర్శి నాయకపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంగాల చిన్న, దేవస్థాన ధర్మకర్త భరత్, యూత్ అధ్యక్షుడు సాయికుమార్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాయకంటి సురేష్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం 4వ డివిజన్ కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

హన్మకొండ చౌరస్తా: పద్మశాలి సంఘం 4వ డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు హనుమకొండలోని పెద్దమ్మగడ్డ బైపాస్‌రోడ్డులో ఏఆర్ఆర్ గార్డెన్ సమీపంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగాయి. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందా మల్లయ్య, పాశికంటి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలను కుసుమ లక్ష్మీనారాయణ, గుడిమల్ల కృష్ణారావు, చిలుకమారి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ధూమపాటి నటరాజ్, ప్రధాన కార్యదర్శిగా పిట్ట భరత్‌కుమార్, కోశాధికారిగా కూచం రాంచందర్‌తో పాటు మరో 25మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాళోజీ ఇంద్రానగర్ కమిటీ..

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని శ్రీకాళోజీ ఇంద్రానగర్ కాలనీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ర్యాకల సత్యం, ప్రధాన కార్యదర్శి కేతిరి రాజేందర్, కోశాధికారిగా కరుణాకర్, సహాయ కోశాధికారిగా జాటోతు శంకర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా దారవత్ భాగ్య నాయక్, లకావత్ పాండునాయక్, సహాయ కార్యదర్శిగా గద్దె రాజేందర్‌గౌడ్, ఆర్గనైజర్లుగా బండి దేవేందర్, ముఖ్య సలహాదారుడిగా ఎండీ.హుస్సేన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

యువతికి వేధింపులు

ఖిలా వరంగల్: వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్‌తోటకు చెందిన యువతిని అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు తనను పెళ్లి చేసుకోవాలంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈక్రమంలో తరుచుగా సదరు యువతిని వెంబడించి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దాంతో భయాందోళన గురైన ఆ యువతి.. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

అనాథలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న కుమార్‌మాదిగ

కాజీపేట: విద్య, ఉద్యోగ అవకాశాల్లో అనాథలకు ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని బహుజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. కాజీపేట చౌరస్తాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో సోమవారం నిర్వహించనున్న అనాథ అరిగోస దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిలువేరు ఆశీర్వాదం, జన్ను దినేష్, మంద రాజు, బండారి సురేందర్, గద్దల కుమార్, అక్కెనకుంట వెంకటస్వామి, రేనుకుంట్ల మహేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా అభివృద్ధి పనులు

- కానరాని నాణ్యతా ప్రమాణాలు
- తూతూమంత్రంగా నిర్మాణ పనులు
- పట్టించుకోని ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు



నాసిరకంగా నిర్మిస్తున్న సైడ్ డ్రెయినేజీ



పెచ్చులూడుతున్న డ్రెయినేజీ గోడ



డస్ట్ పోసి నిర్మిస్తున్న సైడ్ డ్రెయినేజీ గోడ

వరంగల్: నగరంలోని 21వ డివిజన్ మొయిన్‌పురాలో అభివృద్ధి పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.35లక్షల మున్సిపల్ కార్పొరేషన్ నిధుల వ్యయంతో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ పనుల్లో ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న పనులను పట్టించుకునే వారు లేకుండాపోయారు. ఇందుకు సంబంధించిన పర్సంటేజీలు ఇచ్చేందుకు డివిజన్ ప్రజాప్రతినిధి, ఇంజనీర్లతో సదరు కాంట్రాక్టర్ ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకోవడంతోనే నాణ్యత లేకుండా పనులు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

సైడ్ డ్రెయినేజీ నిర్మించే ముందు బేస్ డస్ట్ వేయడంతో పాటు 6అంగుళాల సిమెంటు కాంక్రీట్ 45ఎంఎం కంకర వేయాల్సి ఉంటుంది. అయితే, ఇక్కడ జరుతున్న పనుల్లో డ్రెయినేజీ కింద కేవలం డస్ట్ పోసి ఇరుపక్కలా సిమెంటు కాంక్రీట్‌తో గోడలు నిర్మిస్తున్నారు. గోడల నిర్మాణంలో సైతం నాణ్యత ఇసుమంతా కూడా కనిపించడం లేదు. 20ఎంఎం. 40ఎంఎం కంకర, సిమెంటు, ఇసుక నిర్దేశించిన మేరకు మిశ్రమం కలిపి గోడలు నిర్మించాల్సి ఉంది. మొయిన్‌పురాలో నిర్మిస్తున్న కాంక్రీట్ గోడల్లో సిమెంటు తక్కువ, 40ఎంఎం కంకర, డస్ట్, ఇసుక ఎక్కువ పాళ్లలో వాడడం వల్ల మన్నిక కరువైంది. రూ.35లక్షల ఖర్చుతో పనులు జరుగుతున్నా అధికారులు, కాంట్రాక్టర్ పర్యవేక్షించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి పనులు నాణ్యత ప్రకారం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి రథోత్సవం



స్వామి వారిని రథోత్సవంపై ఊరేగిస్తున్న భక్తులు, అర్చకులు

వరంగల్ చౌరస్తా: బ్రహ్మోత్సవాల్లో భాగంగా వరంగల్ బట్టలబజారులోని వేంకటేశ్వర దేవాలయంలో భూదేవి, వేంకటేశ్వర స్వామిని రథోత్సవంపై అర్చకులు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఊరేగించారు. చిన్నజీయర్ స్వామి శిష్య బృందం రాఘవాచార్యుల మంత్రోచ్చరణతో ఆలయ అర్చకుల సమక్షంలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నిత్యారాధన, ద్వారతోరణం, నిత్య హవనం, నిత్య పూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలు, అమ్మవారికి ఒడిబియ్యం (సారె) నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, మహా అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గందె కల్పన, చింతాకుల అనిల్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గందె గోవిందరాజులు, గుమ్మడవెల్లి సత్యనారాయణ, ఆలయ సేవా సమితి సభ్యులు రవ్వ కృష్ణమూర్తి, గరిమళ్ల లక్ష్మీనర్సయ్య, శ్యాంసుందర్, మల్లన్న దేవస్థాన చైర్మన్ బెల్లం రాజు, రషీషధాని, చింతకుల సునీల్, కొండూరు జ్ఞానేశ్వర్, దాలియా పరివారం, తోనుపునూరి అశోక్, ఈశ్వర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎలపాటి రత్నాకర్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటాం



వయోవృద్ధులను సన్మానిస్తున్న చీఫ్‌విప్

నయీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాలనీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా 53వ డివిజన్‌లో చీఫ్‌విప్ ఆదివారం విస్తృత స్థాయి పర్యటన చేశారు. డివిజన్‌లో రూ.3కోట్ల విలువైన రోడ్లు, డ్రెయినేజీ, కమ్యూనిటీ హాల్, ఆలయ కల్యాణ మండప నిర్మాణ పనులను పరిశీలించి పూర్తయిన వాటిని ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం కేయూ క్రాస్ భారతి విద్యాభవన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగా జమున తహజీబ్‌కు మారుపేరు బీఆర్‌ఎస్ పార్టీ అని అన్నారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన 300మంది బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, రైతురుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ తూర్పు నాయకుడు కుసుమ సతీష్ పిలుపునిచ్చారు. వరంగల్ 37, 38 డివిజన్లలో మన్‌కీ బాత్ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పుప్పాల రాజేందర్ ఆధ్వర్యంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని బీజేపీ నేతలతో కలిసి సతీష్ వీక్షించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ విదేశీ వస్తువులను విడనాడి స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో రంజిత్, అరుణ్, జనార్దన్, రాజు, చంద్రమోహన్, నందు, ఆయుష్ పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో..

వరంగల్: మన్ కీ బాత్ కార్యక్రమాన్ని 21 డివిజన్‌లో బీజేపీ నేతలు వీక్షించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు వంగాల సమ్మిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు భవాని శంకర్, మన్ కీ బాత్ కోఆర్డినేటర్ కోమాకుల నాగరాజు, సముద్రాల పరమేశ్వర్, బైరి మురళీకృష్ణ, బాకం హరిశంకర్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమమే జేఏసీ లక్ష్యం



మాట్లాడుతున్న మంద వెంకన్న

ఖిలా వరంగల్: గీత కార్మికుల సంక్షేమమే గౌడ జేఏసీ లక్ష్యమని రాష్ట్ర జేఏసీ నేతలు బొనగాని యాదగిరిగౌడ్, జనగాం వెంకన్న, పులి శ్రీనివాస్, మండ వెంకన్న, కార్పొరేటర్ పోశాల పద్మ, స్వామిగౌడ్ అన్నారు. గౌడ సంఘాలు ఐక్యమత్యంతో కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. కరీమాబాద్ రోడ్డులోని ఆదర్శ పరపతి సంఘం భవనంలో మండ వెంకన్న గౌడ్ అధ్యక్షతన గౌడ సంఘాల జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో గౌడ కులస్తులు ముందు నిలిచారని గుర్తుచేశారు. అయితే, నేడు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా గీత కార్మికులు వెనుకబడి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో సుమారు 18శాతం ఉన్న గౌడ కులస్తులకు రాష్ట్ర బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం దక్కడం లేదని వాపోయారు. కులస్తుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే గౌడ జేఏసీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో మార్క రవి, అనంతుల రమేష్‌గౌడ్, గట్టు రమేష్, మండ శ్యామ్, గొడిశాల సూరజ్, న్యాయవాది కూనూరు రంజిత్‌గౌడ్, సందీప్, విజయ్, రామనాథం, బలరాం, కుమారస్వామి, వెంకటస్వామి, కత్తి సాంబయ్య, రాజుగౌడ్, చందు, రాంమూర్తి, మురళి, అనిల్, జగన్, రమేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



పనులను ప్రారంభించిన బన్న ప్రభాకర్

మామునూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు తామంతా సమష్టిగా కృషి చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహంకాళి జిల్లా ఇన్‌చార్జ్ బన్న ప్రభాకర్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం నక్కలపెల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మన్నె బాబురావు ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆర్థికవేత్త, న్యాయశాస్త్ర కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, కుల వివక్షపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని గుర్తుచేశారు. రవిప్రసాద్, రామ్‌చందర్, హరిప్రసాద్, తిరుపతి, రాములు, నర్సింగరావు, కిష్టయ్య, సాంబయ్య, రాజశేఖర్, రాకేష్, మధు, మహేష్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

కాజీపేట రూరల్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి ప్రయోజకులు కావాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ మౌంట్‌ఫోర్టు స్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ మౌంట్ ఫోర్టు ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మౌంట్‌ఫోర్టు స్కూల్ కరస్పాండెంట్ బ్రదర్ ఆంటోని, నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణరావు, సెయింట్ గ్యాబ్రియెల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ అరుణ్‌ప్రకాష్, కార్పొరేటర్ సర్తాజ్‌బేగం, బ్రదర్ కాసుమరెడ్డి, ఫాదర్ రాయప్ప, డీఎస్‌పీఎల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవతో మాతృభూమి రుణం తీర్చుకుంటాం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు

హన్మకొండ చౌరస్తా: ఉద్యోగరీత్యా ఖండాంతరాలు దాటి వెళ్లినప్పటికి సామాజిక సేవా కార్యక్రమాలతో మాతృభూమి రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు కృషి చేస్తూనే ఉంటామని న్యూజెర్సీ, అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు కంచనకుంట్ల శ్రీధర్‌రెడ్డి, పింగిళి భగవాన్‌రెడ్డి అన్నారు. న్యూజెర్సీ, అమెరికన్ తెలంగాణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ 10వ డివిజన్‌లోని లెప్రసీకాలనీ వాసులకు, ములుగురోడ్డులోని స్నేహ మహిళా సొసైటీ, నిట్ ఎదురుగా ఉన్న సహృదయ వృద్ధాశ్రమం, హంటర్‌రోడ్డులోని ఏకశిల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి న్యూజెర్సీ, అమెరికా లాంటి దేశాలకు వలసవెళ్లి అక్కడే స్థిరపడ్డప్పటికీ మాతృదేశంపై మమకారంతో పుట్టిపెరిగిన జిల్లాలోని పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డిలను కాంగ్రెస్ నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రిటైర్డ్ ఏసీపీ విద్యాసార్, డీఎఫ్‌ఓ జోగేందర్, ప్రొఫెసర్ మకరంద్, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, వ్యాపారవేత్తలు వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

3కే ఫిట్‌రన్‌ను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీను, నిర్వాహకులు

హన్మకొండ చౌరస్తా: రాజ్ ఎరోబిక్స్, డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న నిర్వహించనున్న 3కే ఫిట్‌రన్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సినీ నిర్మాత వరంగల్ శ్రీను పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఏరోబిక్ సెంటర్‌లో నిర్వాహకులతో కలిసి ఫిట్‌రన్ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ 12న ఉదయం 8గంటలకు నిట్ వద్ద ప్రారంభమై హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వరకు ఫిట్‌రన్ కొనసాగుతుందని వివరించారు. నగరంలోని యువత, క్రీడా సంఘాల బాధ్యులు, వాకర్లు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రాజ్ ఎరోబిక్స్ అకాడమీ చైర్మన్ రాజ్‌కుమార్, తిరుపతి, వినోద్, సంజీవ్, అంజలీదేవి పాల్గొన్నారు.

విద్యుత్ రిటైర్డ్ ఇంజనీర్ల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న గోపాల్‌రావు, తదితరులు

హన్మకొండ: విద్యుత్ విశ్రాంత ఇంజనీర్ల నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని విద్యుత్ విశ్రాంత ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని గుర్తుచేశారు. ఇది ఉద్యోగుల అవిశ్రాంత కృషితో సాధ్యమైందని కొనియాడారు. దైనందిన జీవితంలో డైరీ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. రిటైర్డ్ ఇంజనీర్స్ టెలిఫోన్ డైరెక్టరీని అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. కొండల్‌రావు, సత్యనారాయణ, సుధాకర్, భీమ్ రావు, సుదర్శన్, సోమనర్సయ్య పాల్గొన్నారు.

ఖురాన్ పఠన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా మూల్వి మహమ్మద్ రియాసుద్దీన్ మాట్లాడుతూ సర్వమతాల సారాంశం ఒక్కటేనని అన్నారు. విద్యార్థులు సోదరభావంతో కలిసి ఉండాలని సూచించారు. ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవడమే లక్ష్యంగా చదువుకోవాలని అన్నారు. అనంతరం ఖురాన్ పఠన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా విజిలెన్స్ ఆఫీసర్లు మహమ్మద్ అంజద్, యాకూబ్ పాషా, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరిపై చలి పంజా..

- వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- ఆందోళనలో అన్నదాతలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు



దెబ్బతిన్న వరి

హసన్‌పర్తి: వాతావరణంలో మార్పుల కారణంగా వరిపంట దెబ్బతింటోంది. చలితో ప్రభావంతో పగటి, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులతో వరి పంట పూర్తిగా చేతికి అందకుండా పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చలిప్రభావంతో మొగి పురుగు కారణంగా నాటు వేసిన వరి దెబ్బతింటోంది. ప్రస్తుత సీజన్‌లో హసన్‌పర్తి మండల వ్యాప్తంగా సుమారు 11వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. అయితే, ఈ ప్రాంతంలో నీటి సౌకర్యం పుష్కలంగా ఉండడం వల్ల రైతులు వరిసాగుకు మొగ్గు చూపారు. ఈ క్రమంలో కొంతమంది రైతులు ముందుగానే వరినాట్లు వేశారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా వరి కాండాన్ని మొగి పురుగు తొలచడంతో పంట ఎదుగుదల లేకుండా స్తంభించింది. దాంతో క్రిమిసంహారక మందుల వినియోగం ఎక్కువైంది.

అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి

కాగా, హసన్‌పర్తి మండలంలోని హసన్‌పర్తి, సీతంపేట, అన్నాసాగరం, ముచ్చర్ల, జయగిరి, మడిపల్లి, చింతగట్టు, సూదన్‌పల్లి, వంగపహాడ్, దేవన్నపేట, మునిపల్లి గ్రామాల్లో ముందుగా వరినాట్లు వేసిన రైతులు పెద్దఎత్తున నష్టపోయారు. సుమారు ఆరునుంచి ఏడు వేల ఎకరాల్లో ఈ దుస్థితి నెలకొంది. ఈసీజన్‌లో పంట పూర్తిగా చేతికందకుండా పోతుందేమోనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ ప్రభావం కారణంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాతావరణంలో మార్పుల కారణంగా..

వాతావరణంలో మార్పుల కారణంగా వరి పంట దెబ్బతింటోంది. ముందుగా నాట్లు వేసుకున్న రైతులు ఎక్కువగా నష్టపోయారు. ఈక్రమంలో అధికారుల సూచనలను అన్నదాతలు పాటించి ముందుకు సాగాలి.

– అనురాధ, ఏఓ

మార్కెట్ చైర్‌పర్సన్‌గా దళిత మహిళ?

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్‌గా దళిత మహిళకు అవకాశం దక్కనుంది. ప్రస్తుతం వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు వరంగల్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్‌ను ఖరారు చేసే బాధ్యతలు ఉన్నట్లు సమాచారం. ఇందులో గత పాలక వర్గాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులుగా ఉన్న గుండ్ల సింగారానికి చెందిన గనిపాక విజయ్ సతీమణి కల్పన, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, కాపులకనపర్తికి చెందిన పసునూరి సారంగపాణి సతీమణి భాగ్యలక్ష్మి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వర్ధన్నపేట ఎమ్మెల్యే నిర్ణయానికే పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు బహిరంగంగానే వెల్లడిస్తున్నారు. గత పాలకవర్గం చైర్‌పర్సన్‌గా కొనసాగిన దిడ్డి భాగ్యలక్ష్మి పదవీకాలం ఆరు నెలలు పొడిగించాల్సి ఉండగా, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీంతో పొడిగింపు లభించలేదు.

మార్కెట్‌లోకి 'గ్రాండ్ ఐ10 నియోస్'



కార్ల ఆవిష్కరణలో ఏసీపీ గిరికుమార్, షోరూం ఎండీ యుగేందర్, సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: వరంగల్ మార్కెట్‌లోకి హ్యూందాయ్ సరికొత్త మోడల్స్ గ్రాండ్ ఐ10 నియోస్, ఆరా కార్లు విడుదలయ్యాయి. ములుగు రోడ్డులోని హేమ హ్యూందాయ్ షోరూంలో జరిగిన కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ గిరికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై గ్రాండ్ ఐ10 నియోస్, ఆరా కార్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ నగరాలతో పోటీ పడుతూ హేమ హ్యూందాయ్ షోరూం వారు సరికొత్త మోడల్ కార్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ యుగేందర్ మాట్లాడుతూ గ్రాండ్ ఐ10 నియోస్ కారు ఎక్స్ షోరూం ధర రూ.5.68 నుంచి రూ.8.46 లక్షల వరకు, ఆరా కారు ధర రూ.6.29లక్షల నుంచి రూ.8.87లక్షల వరకు ఉందని తెలిపారు. రెండు మోడల్స్ సీఎన్‌జీ, పెట్రోల్ వెర్షన్లలో అందుబాటులో ఉన్నాయని, ఈ కార్లలో 30కి పైగా అధునాతన, భద్రతా ఫీచర్లు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీధర్, పృథ్వీ, ఆదిత్య, ఆదర్శ్ ఏజీఎం మహేష్, సేల్స్ మేనేజర్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు లైసెన్స్‌మేళా



మేళాను ప్రారంభిస్తున్న అభినవ్ భాస్కర్

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన డ్రైవింగ్ లైసెన్స్‌మేళాను 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈమేరకు డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆటోడ్రైవర్లు దరఖాస్తులు నింపి కార్పొరేటర్‌కు అప్పగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకు నర్సింగ్, ఎలకంటి రాములు, ట్రాఫిక్ ఎస్సై నాగరాజు, ఈసంపల్లి సంజీవ్, మల్లేశం, శ్రీధర్ రెడ్డి, ఎండి.ఖాజా పాల్గొన్నారు.